


## *జాబిలి మీద సంతకం*

**శ్రీ ఏ.బి.కె ప్రసాద్** సుప్రభాతం పక్ష పత్రికలో ఎడిటర్‌గా చేరాక నన్ను ఓ సీరియల్ రాయమని కోరారు. పాఠకురాళ్ళని దృష్టిలో వుంచుకుని అల్లుకున్న ఓ థీమ్‌ని చెపితే ఆయన దాన్ని అంగీకరించారు.




ఈ థీమ్ ఒక్కసారిగా దేంతోనో ఇన్‌స్పైర్ అయి డెవలప్ చేసుకున్నదికాదు. అనేకమంది అభిన పాఠకురాళ్ళని కలిసాక వారిలోని మౌలికమైన కొన్ని లక్షణాలని గమనించాక క్రమంగా రూపుదిద్దుకున్న కథ ఇది. దీనికి కవిత్వ ధోరణిలో పేరు పెట్టాలని ఉద్దేశం. కాని నాది కవి హృదయంకాదు. దాంతో వివిధ సందర్భాల్లో కలిసినప్పుడు 'సిరివెన్నెల సీతారామశాస్త్రి'గారిని, 'జొన్నవిత్తు'లని అలాంటి శీర్షికని సూచించమని కోరాను. వారి నించి ఎలాంటి స్పందనా లేదు. 'వేటూరి'గారు 'శ్రీవారి శోభనం' చిత్రం కోసం రాసిన టైటిల్ సాంగ్‌లోని చరణం 'జాబిలి మీద సంతకం' తీసుకుని ఈ నవలకి ఆ పేరు పెట్టాను.

1990ల్లోని ఫక్తు మధ్యతరగతి తెలుగు మహిళ జీవితాన్ని ప్రతిబింబించే, అమలిన శృంగారపు కథ ఇది. మౌలికమైన ఆ లక్షణాలని కథగా మార్చాను. పెళ్ళయ్యాక, ముఖ్యంగా పిల్లలు పుట్టి ముప్పైలు దాటుతూండగా తమలో సౌందర్యం, ఆకర్షణ తగ్గిపోతోందేమోననే చింత, కుటుంబ సభ్యులకి అంకితం అవడం, ఇంటిని మేనేజ్ చేయడం, ఒకోసారి పరాయి మగాడి పట్ల ఆకర్షణ కలగడం, టీనేజ్ కూతుళ్ళలో హార్మోన్స్ మార్పువల్ల కలిగే అయోమయం, మూడ్ ఛేంజెస్‌కి బలయ్యే తల్లి, తోడబుట్టిన వారి మధ్య చిన్నతనపు పోట్లాటలు, తన భర్త తనని ప్రేమించడం ఆగిపోయిందని బాధ పడటం మొదలైనవి ఈ నవల్లో ప్రధానాంశాలు. కొందరు సంస్కారంతో అలాంటి ఆకర్షణని అణచేసుకుంటారు. ఇంకొందరు ముందుకి వెళ్తారు. అణచేసుకునే ఓ ఇల్లాలి కథ ఇది.

లోహిత పదమూడేళ్ళ కూతురి తల్లి. మెంటల్ హాస్పిటల్‌లో ఎనిమిదేళ్ళుగా పనిచేస్తున్న డాక్టర్ శాంతారాం. వారి మధ్య ఓ సన్నివేశం ఇలా సాగుతుంది. ఇదీ ఈ నవల థీమ్.

*"నాకు మీ సాన్నిహిత్యం కావాలి." డాక్టర్ శాంతరాం కోరాడు.*

*"సాన్నిహిత్యమా?"*

*"నేను ఒంటరితనాన్ని భరించలేకపోతున్నాను. అందుకు కారణం మీరే. మిమ్మల్ని చూసినప్పటినించే ఒంటరివాడిని అయ్యాను. దయచేసి నాకు సహాయం చేయండి."*

*"ఏం సహాయం?" లోహిత అడిగింది.*

*"నేను ఒంటరిగా ఫీలవకుండా వుండాలంటే నన్ను ఇష్టపడేవారు అంటూ ఒకరు కావాలి. అది మీరే. మీరు నాకు కావాలి. నన్ను ప్రేమించే మనిషి కావాలి."*

*"ఐతే పెళ్ళి చేసుకోండి."*

*"కానీ మీకు పెళ్ళయిందిగా?"*

*"నన్నా? ఛీ!"*

*"మీకు అర్థం కాలేదు. శారీరక సుఖం కాదు నేను కోరేది. మనసుకి నచ్చిన వారితోనే ఒంటరితనం పోతుంది. నన్ను ప్రేమించే మనిషి వుంటే నాకెంత ధైర్యం? లోన్లీగా ఫీలవను. మీకు ఎక్కడ వున్నా, ఎలా వున్నా మీ మనసులో నిండుతనం, మీకో భర్త, ఇద్దరు పిల్లలు వున్నారని. నాకు అలాంటి నిండుతనం కావాలి - మీ నించి. మానసిక ఆసరా. నా గురించి మీరు అలా ఫీలవ్వాలి... ఎలా చెప్పాలో నాకు అర్థం కావడంలేదు."*

*"ఇది మీరు పెళ్ళయిన వారిని అడగకూడనిది. నా వయసు పదహారో, పద్దెనిమిదో కాదు. మీరనుకున్నవి ఏవీ నాలోలేవు. నాకు ట్యూబెక్టమీ ఆపరేషన్ అయినప్పటి నించి పొట్ట పెరిగింది. పొత్తికడుపు మీద అసహ్యంగా కనిపించే తెల్లచారలు వున్నాయి. లో బి.పి వుంది. ఇంకా ... ఇంకా బ్రెస్ట్ కేన్సర్ వల్ల నా రైట్ బ్రెస్ట్‌ని తీసేసారు."*

*"నో. నో. మీ సాన్నిహిత్యం మీ ఒంటికోసం కాదు. నాకు మీరు కావాలి. మీరు వర్ణించిన తీరులో వున్న మీరు కావాలి. అలా వున్న మీరు మీ భర్తకి ఎలా కావాలో నాకూ అలాగే కావాలి. కామపు పొంగు వయసులోని వారికి ప్రేమేం తెలుస్తుంది? మీది ప్రేమించే, ఆదరించే వయసు. ప్రేమ లేకుండా ఇద్దరు పిల్లల్ని పెంచగలరా? డేమిట్! నా మనసులోని విషయాన్ని ... ఉహు.. అది బయటికి వ్యక్తం చేయలేకపోతున్నాను."*

*"నేను ఆలోచించుకోవాలి". అప్పటికి తప్పించుకోడానికి లోహిత చెప్పి తప్పించుకుంది. ఆ తర్వాత ఆమె ప్రవర్తన ఎలా వుంటుంది?*

బెంగుళూర్ నించి నాకు వుత్తరాలు రాసే లోహిత ఏజ్ గ్రూప్‌లోని ఓ పాఠకురాలు తనకి ఇలాంటి సందర్భం ఎదురైనప్పుడు స్ట్రాంగ్ కాఫీ కలుపుకుని తాగి మంచం మీద పడుకున్నానని రాసారు. లోహిత అలా చేస్తుంది.

ఫిల్మ్ ఆర్టిస్ట్ 'బెనర్జీ' ఓసారి మాటల్లో తప్పు చేసిన భార్యని ఒకరు ఎలా ట్రీట్ చేసారో చెప్పారు. డైనింగ్ టేబిల్ మీద ఓ రూపాయి నాణెం వుంచి, 'ఇది నా భార్య ఓసారికి తీసుకునే డబ్బు' అని రాసి వుంచాడు. తన భార్యని శిక్షించిన విధం అది. ఆ వ్యక్తి మనస్థత్వం నించి లోహిత స్నేహితురాలు సుకన్య, భర్త కులపతి పాత్రలని అల్లుకుని దీంట్లో ఉపకథగా చొప్పించాను. ఇంకా టెర్రరిజం ఆరంభదశలో వున్న రోజుల్లోనే 'దేశానికి టెర్రరిజం ఎంతటి ప్రమాదకరమైందో, కుటుంబానికి అక్రమ సంబంధం అంత ప్రమాదకరమైంది' అనే డైలాగ్‌ని 1992లో ఈ నవలో రాసాను.

నేను ఆడిట్‌కి వెళ్ళినప్పుడు కొన్ని ప్రాజెక్ట్ ప్రాంతాలని చూసాను. అక్కడి జీవితం మీద గల అవగాహనతో ఇది రాసాను. శ్యామలరావు ఆంధ్రప్రదేశ్ - మధ్యప్రదేశ్‌ల మధ్య గోదావరి మీద భారీ వంతెన నిర్మించే ప్రాజెక్ట్‌లో ఆటవిక ప్రాంతంలో నివసిస్తూంటాడు. క్వార్టర్స్‌లో అతని భార్య లోహిత, పదమూడేళ్ళ కూతురు, తొమ్మిదేళ్ళ కొడుకుతో బస. ఆఫీస్ పనితో వూపిరి సలపదు. టైప్ ఒన్ డయాబెటిస్ వల్ల తాత్కాలిక నపుంసకత్వంతో బాధ పడుతూంటాడు. ఆ ప్రాజెక్ట్‌కి శాంతారాం డాక్టర్. ఆ ఇల్లాలు లోహిత, డాక్టర్ల మధ్య మొదలైన అక్రమ సంబంధానికి దారి తీయని సక్రమ సంబంధ సంఘర్షణ, చివరకి డాక్టర్ మరణం, లోహిత భర్త శ్యామలరావు బదిలీలతో కథ ముగుస్తుంది. మానసికంగా విచిత్రంగా ప్రవర్తించే కులపతి, ఉల్లాస్ ఉప కథలకి చెందిన పాత్రలు. మధ్యప్రదేశ్‌లోని గోండియాలో నా అభిమాన పాఠకురాలు వుండేది. 1982లో వారి వూరు వెళ్ళి వారింట్లో కొద్దిరోజులు వున్నాను. ఆమె జీవితంలో తారసపడ్డ ఓ పంజాబీ వ్యక్తి

ఉల్లాస్ పాత్రకి ప్రేరణ. 'వెన్ ఏ వైఫ్ సిన్స్, హర్ హజ్బెండ్ ఈజ్ నెవర్ ఇన్నోసెంట్' అని చివర్లో శ్యామలరావు తన భార్య లోహిత ముందు ఒప్పుకుంటాడు. నా మనసులోకి తొంగి చూసి రాసారా అని, లోహిత పాత్రతో అనేక అంశాల్లో ఐడెంటిఫై చేసుకున్నామని చాలామంది పాఠకురాళ్ళు వుత్తరాలు రాసారు.

"మా పిల్లలు స్కూల్ నించి రాబోయే ముందు నేను కూడా వారికోసం తినడానికి ఏం చేయాలా అని వెతుక్కుంటాను. వేరుశెనగ కాయల్ని వుడకపెట్టడం, జంతికలు చేయడం, మా టీనేజ్ అమ్మాయి ఎదుగుతూంటే నేను ముసలిదాన్ని అవుతున్నావా అని భయపడటం నా జీవితంలో జరిగే సంఘటనలే." ఓ అభిమాని చెప్పింది.

అప్పట్లో ఎం.టి.ఆర్ రెడీ టు ఈట్ టమోటా బాత్ పాకెట్లు వచ్చాయని, దాని గురించి రాసానని ఈ నవల చదువుతూంటే గుర్తొచ్చింది.

హాస్యపాత్రకి అవకాశంలేని ఈ నవల్లో అక్కడక్కడా హాస్యాన్ని రాసాను.

*"మీ అన్నయ్యలు ఏం చేస్తున్నారు?" లోహిత అడిగింది.*

*"మా పెద్దన్నయ్య ఇంకా మైనరే. చిన్నన్నయ్య ఇటీవలే మేజర్ అయ్యాడు."*

*"అదేమిటి తప్పు చెప్పావు? చిన్నన్నయ్య మేజరైనప్పుడు పెద్దన్నయ్య ఇంకా మైనరెలా అవుతాడు?"*

*"రైటే చెప్పాను. పెద్దన్నయ్య కోలార్ గోల్డ్‌ఫీల్డ్‌లో మైనర్‌గా పనిచేస్తున్నాడు. చిన్నన్నయ్య ఆర్మీలో మేజర్‌గా పనిచేస్తున్నాడు." సుకన్య వివరించింది.*

"యు ఆర్ పోజింగ్ సమ్ ఇంట్రెస్టింగ్ క్వశ్చన్స్." అని ఏ.బి.కె.గారు నవల మధ్యలో వుండగా ఓసారి నాతో అన్నారు.

ఏ.బి.కె.గారి శిష్యుడైన సబ్ ఎడిటర్ పేరు 'శాంతారాం' అని ఈ సీరియల్ ఆరంభం అయ్యాక చెప్పాడు. ఇది తెలిసి జరగలేదు. అంతదాకా ఉపయోగించని పేరని వాడాను.

వారి కార్యాలయంలో తారసపడ్డ 'కుప్పిలి పద్మ' తనకి ఆ నవల బాగా నచ్చిందని చెప్పారు. ఈ నవల పుస్తకంగా జనవరి 1993లో వెలువడ్డాక హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లి నించి 'నువ్వంటే నాకిష్టం' అనే విధంగా ప్రవర్తించని భర్తగల లోహిత అనే ఆమె నాకు ఫోన్ చేసి, నేను తనని చూసి ఆ నవల్లో లోహిత పాత్రని రాసినట్లుగా ఫీలయ్యానని చెప్పింది. అనేకసార్లు కలిసాం. ఆమె అసలు పేరు లోహిత కాదు. కాని నన్నాపేరుతోనే పిలవమని కోరేది. ఆమె మొదటి నించీ సాయి భక్తురాలు. నేను ఆధ్యాత్మిక మార్గంలోకి వచ్చాక ఆమె చాలా చాలా ఆనందపడ్డారు.

లిపి పబ్లికేషన్స్ దీన్ని జనవరి 1998లో పునర్ముద్రించారు. వెల రూ.50/- ఏ పత్రికో గుర్తులేదు కానీ కన్నడంలోకి అనువదించబడి సీరియల్‌గా వెలువడింది. తెలుగు నవలా పాఠకుడు క్రాంతికుమార్ గారు 'స్వాతి' సినిమా తీసాక కొద్దికాలం దీని గురించి సీరియస్‌గా ఆలోచించి విరమించుకున్నారు. మళయాళంలో తప్ప ఈ తరహా కథలని తెలుగు తెరకి ఎవరూ ఎక్కించరు.

ఈ నవల మళ్ళీ చదివాక నాకు అనిపించింది, ప్రేమ నవల ఏ కాలంలోనైనా రాయచ్చు కానీ ఇలాంటి నవల రాయడం కష్టం అని. ఆ నాటి సెంటిమెంట్స్, సున్నితత్వాలు నేటి తరంలో చాలా తగ్గిపోయాయి.

www.anandbooks.com
www.telugubooks.in

Click here to share your comments on this story